కలెక్టరేట్‌లో బయోమెట్రిక్‌

- డిసెంబర్‌ నుంచి వేలి ముద్రతతో హాజరు నమోదు
- వివిధ శాఖల్లో 400 మంది అధికారులు, ఉద్యోగులు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ కార్యాలయం(కలెక్టరేట్‌)లో బయోమెట్రిక్‌ విధానం అమల్లోకి రానుంది. ఈ నెలాఖరు కల్లా కలెక్టరేట్‌లో ఒక అంతస్తుకు రెండు చొప్పున గ్రౌండ్‌ ఫ్లోర్‌తో కలిపి మొత్తంగా 6 బయోమెట్రిక్‌ యంత్రాలను అమర్చేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. డిసెంబర్‌ నుంచి బయోమెట్రిక్‌ పద్ధతిని అమల్లోకి తీసుకురావడం ద్వారా కలెక్టరేట్‌లోని వివిధ శాఖలు ,విభాగాల అధికారులు ,ఉద్యోగులు,సిబ్బంది హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

4 నెలల క్రితమే..

గత 4 నెలల క్రితమే కలెక్టరేట్‌లో బయోమెట్రిక్‌ విధానాన్ని ప్రవేశపెట్టాలని భావించినప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమైంది. ఎట్టకేలకు డిసెంబర్‌ నుంచి అమల్లోకి తీసుకొస్తున్నారు. జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ ఆదేశాల మేరకు సంబంధిత శాఖ అధికారులు ,ఉద్యోగులు బయోమెట్రిక్‌ పద్ధతి అమల్లో భాగంగా చేపట్టాల్సిన చర్యలు,విధివిధానాలపై ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బయోమెట్రిక్‌ విధానం ద్వారా ఉద్యోగుల హాజరు శాతాన్ని మెరుగు పరచటంతో పాటు విధుల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

- రోజూ ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి చేరుకోవాల్సి ఉంటోంది. సాయంత్రం 5 గంటల వరకు విధులకు హాజరు కావాలి.
- నగర శివారు తూముకుంట మున్సిపాలిటీలోని అంతాయిపల్లిలో మేడ్చల్‌ జిల్లా కలెక్టర్‌ కార్యాలయం జీప్లస్‌ టూ అంతస్తులలో 86 గదుల్లో కొనసాగుతోంది.
- జిల్లా కలెక్టర్‌తో సహా ఇద్దరు జిల్లా అదనపు కలెక్టర్లు, డీఆర్‌డీఓ, వివిధశాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, పర్మనెంట్‌, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ సిబ్బంది మొత్తం కలిపి దాదాపు 400 మంది పనిచేస్తున్నారు. డిసెంబర్‌ నుంచి వీరి హాజరు నమోదు బయోమెట్రిక్‌ యంత్రంలో రికార్డు కానుంది.

ఉద్యోగుల పూర్తి వివరాలు..

కలెక్టరేట్‌లో వివిధ జిల్లా శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది వివరాలను బయోమెట్రిక్‌ మిషన్లలో నమోదు చేశారు. దీంతో ఉద్యోగులు రోజూ బయోమెట్రిక్‌ యంత్రంలో తమ వేలిముద్రతో హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఆలస్యం నెపంతో అటు నుంచి అటుగా ఇళ్లకు వెళ్లిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే జిల్లా అధికార యంత్రాంగం బయోమెట్రిక్‌ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు తెలుస్తోంది.

కలెక్టరేట్‌ బయటి శాఖలివే..

కలెక్టరేట్‌ వెలుపల మేడ్చల్‌, మల్కాజిగిరి ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ కార్యాలయాలు, జిల్లా ఇంటర్మీడియట్‌ అధికారి కార్యాలయం, జిల్లా రిజిస్ట్రార్‌, జిల్లా అటవీశాఖ, జిల్లా రవాణాశాఖ కార్యాలయాలు ఉన్నాయి.

సర్వే పేరుతో ..అన్యాయం జరిగితే సహించబోం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- కులగణన సర్వేలో ప్రజల వ్యక్తిగత విషయాలు ఎందుకు?
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: సర్వే పేరుతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అన్యాయం జరిగితే సహించబోమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కుల గణన సర్వేలో వ్యక్తిగత విషయాలు అడగటం ఎందుకని ప్రశ్నించారు. బుధవారం ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌లో బీఆర్‌ఎస్‌ డివిజన్‌ అధ్యక్ష, కార్యదర్శులు ఇర్ఫాన్‌, మేకల హరినాథ్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్‌ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యక్తిగత విషయాలను రిజర్వేషన్ల తొలగింపు కోసమే అడుగుతున్నారా? అని అన్నారు. కులగణన సర్వే కోసం ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించి, నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, కుల సంఘాలతో చర్చించి ఉంటే బాగుండేదన్నారు. సర్వేకు సహకారం అందించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని, వారికి అన్యాయం జరిగితే మాత్రం పోరాటం చేస్తామన్నారు. ప్రజా సమస్యలు, ఇంటి పన్ను, వాటర్‌ బిల్లుల పెంపు, అభివృద్ధి విషయంలో పోరాటం చేసేందుకు నియోజకవర్గంలో వెయ్యి మంది నాయకులు, కార్యకర్తలతో కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కార్యకర్తలు సర్వేకు సహకరించి ప్రజలకు అన్యాయం జరగకుండా చూడాలని సూచించారు. హైడ్రా విషయంలో మొదటిసారిగా ప్రశ్నించిన వ్యక్తిని తానేనని గుర్తు చేశారు. ప్రాణం ఉన్నంతా వరకు ప్రజల కోసమే పని చేస్తానన్నారు. బీఆర్‌ఎస్‌ పాలనలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని వివరించారు. 6 గ్యారంటీలను గాలికి వదిలేసిందని, ఇప్పటికైనా ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో నరేందర్‌గౌడ్‌, మక్కాల నర్సింగ్‌రావు, బాల్‌రాజు, సయ్యద్‌ ఏజాజ్‌, కర్రె జంగయ్య, మక్కాల సత్యనారాయణ, బుర్రి యాదగిరి, గడ్డం నర్సింగ్‌రావు, వేణుగోపాల్‌రెడ్డి, ఖాదీర్‌, మట్టి శ్రీను, ఉదయ్‌ యాదవ్‌, అవినాష్‌, లలిత, సరోజాదేవి, అనురాధ, దుర్గ పాల్గొన్నారు.



బస్తీ దవాఖానాల్లో సౌకర్యాలు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: హనుమాన్‌నగర్‌, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్‌ సర్కిళ్లలో ఉన్న బస్తీ దవాఖానాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు దుండిగల్‌ హాస్పిటల్‌లోని వైద్యాధికారులు ఓంకార్‌, భీమాలను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంవత్సరం నుంచి బస్తీ దవాఖానాల్లో రోగులకు ఎలాంటి మందులు ఇవ్వటం లేదన్నారు. అదే విధంగా రక్తపరీక్షలు కూడా చేయడం లేదన్నారు. వివిధ సమస్యలను అధికారులకు వివరించారు. రక్త పరీక్షలు చేసే విధంగా చర్యలు చేపడతామని, ఏఎన్‌ఎం లేని చోట వారిని భర్తీ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఎం. శంకర్‌, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్‌ ముకుందర్‌రెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌ కార్యాలయంలో ఓటరు జాబితా స్పెషల్‌ సమ్మరీ రివిజన్‌పై రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. శేరిలింగంపల్లి ఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్‌ ముకుంద్‌ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 9,10 తేదీల్లో పోలింగ్‌స్టేషన్‌ కేంద్రాల్లో జాబితాలతో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని, జాబితాలను పరిశీలించి ఏమైనా తప్పులు ఉంటే సవరణకు, అడ్రస్‌ మార్పు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా సమగ్ర కుటుంబ సర్వేకు వచ్చే సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రేమ్‌కుమార్‌, డిప్యూటీ తహసీల్దార్‌ అవినాష్‌రాయ్‌, నాయకులు మిద్దెల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మూసాపేటలో ఇంటింటికీ స్టిక్కర్లను వేస్తున్న సర్వే సిబ్బంది

ఇంటింటి సమగ్ర సర్వే షురూ

- 56 ప్రధాన ప్రశ్నలు, 19 అనుబంధ ప్రశ్నలు
- వివిధ డివిజన్‌లలో ఇళ్లకు స్టిక్కర్లు అంటించిన ఎన్యుమరేటర్లు



మూసాపేట డివిజన్‌లో సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్లు తదితరులు

కూకట్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమంలో భాగంగా సమగ్ర కుటుంబ సర్వే బుధవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రభుత్వ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సామాజిక, ఆర్థిక వివరాలను సేకరిస్తున్నారు. ఆస్తులు, అప్పులు, కులం, ఆదాయమెంత, ఇంట్లో ఎంతమంది ఉంటారు.. వంటి 56 ప్రధాన ప్రశ్నలు, 19 అనుబంధ ప్రశ్నలు మొత్తం 75 రకాల ప్రశ్నలతో కూడిన వివరాలు సేకరించనున్నారు. సర్వేలో కుటుంబ యజమాని, సభ్యుల వివరాలను నమోదు చేయడంతో పాటు కుటుంబంలోని ప్రతి ఒక్కరి ఫోన్‌ నెంబరు, వారు చేసే వృత్తి, ఉద్యోగ వివరాలను నమోదు చేస్తున్నారు. అధికారులు కేవలం ప్రశ్నలు మాత్రమే అడిగి తెలుసుకుంటారని, ఎవరు కూడా ఫొటోలు, ఇతర జిరాక్స్‌ కాపీలు అందజేయాల్సిన అవసరం లేదని కార్పొరేటర్లు తెలిపారు. కార్యక్రమంలో హైదర్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు, వివేకానందనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట, మోతీనగర్‌లో...

మూసాపేటలో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించి మరో రెండు రోజుల్లో వస్తామని, ఆధార్‌ కార్డు, రేషన్‌ కార్డు, ఇతర సర్టిఫికెట్లు దగ్గర ఉంచుకోవాలని అధికారులు తెలిపారు. మూసాపేటలో 61 మంది, మోతీనగర్‌లో 67 మంది సర్వేలో పాల్గొన్నారు. ఉదయం వార్డు కార్యాలయంలో స్టిక్కర్లు తీసుకొని వారికి కేటాయించిన ప్రాంతాల్లో సర్వేలో పాల్గొన్నారు. ఆర్‌పీలు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్‌లు ఎన్యుమరేటర్స్‌గా తీసుకున్నారు. వీరికి ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు సూపర్‌వైజర్లుగా ఉంటారని అధికారులు తెలిపారు.

అల్లాపూర్‌, మూసాపేట డివిజన్‌లో...

అల్లాపూర్‌ డివిజన్‌లో 282 మంది ఎన్యుమరేటర్లు పాల్గొని వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి స్టిక్కర్లను అంటించారు. అదే విధంగా మూసాపేట డివిజన్‌లో 128 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు. ప్రతి బస్తీ, కాలనీల్లో ఉన్నటువంటి ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందజేసిన కుటుంబ వివరాలతో పొందుపరిచిన స్టిక్కర్‌ను అంటించారు.





హైదర్‌నగర్‌ డివిజన్‌ సర్వేలో కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు



వివేకానందనగర్‌ డివిజన్‌లో కార్పొరేటర్‌ రోజాదేవి రంగారావు



పాండురంగానగర్‌లో సర్వేలో పాల్గొన్న అధికారులు, ఎన్యుమరేటర్లు

డీసీకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



మూసాపేట: మూసాపేట సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా వంశీ కృష్ణ బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్‌ పగుడాల బాబురావు వంశీకృష్ణను కలిసి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఎమ్మెల్యే గాంధీ నివాసానికి డీసీ కృష్ణయ్య, జీహెచ్‌యంసీ అధికారులు వచ్చి స్టిక్కర్‌ అంటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశచరిత్రలో తొలిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర కుల గణన చేపట్టడం జరిగిందన్నారు. అధికారులు ఖచ్చితత్వంతో కూడిన సర్వే నిర్వహించాలని, ఎక్కడా ఏ పొరపాటు లేకుండా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ప్రజలు కూడా సిబ్బందికి సహకరించాలన్నారు.

– ఆల్విన్‌కాలనీ

ఘనంగా పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న పీఏసీ చైర్మన్‌ ఆరెకపూడి గాంధీ తదితరులు



అన్నదానంలో పాల్గొన్న కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ రామకృష్ణ వీధిలోని పెద్దమ్మ తల్లి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, వివేకానందనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి రంగారావు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని రామకృష్ణ వీధి అధ్యక్షుడు జనంపల్లి పురేందర్‌రెడ్డి, సునీత దంపతులు నిర్వహించారు. కార్యక్రమంలో గొట్టిముక్కల భాస్కర్‌రావు, చంద్రకాంత్‌, రవికుమార్‌, రాంచంద్రరావు, తాండవ కృష్ణ, జి. ప్రసాద్‌, ఎస్‌. శ్రీధర్‌రావు, సూర్యనారాయణ, చంగల్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, సుధాకర్‌, శ్రీనివాస్‌రెడ్డి, డా.వంశీ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాల సంఖ్య నమోదు కావాలి

కులగణన సర్వేలో కలెక్టర్‌ గౌతమ్‌



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య,ఉపాధి,రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) పూర్తయ్యేనాటికి కచ్చితమైన కుటుంబాల సంఖ్య రావాలని మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం జిల్లాలోని రాంపల్లి దాయర, గోధుమకుంట, అంతాయిపల్లిలలో నిర్వహిస్తున్న సర్వేను జిల్లా అదనపు కలెక్టర్‌ (లోకల్‌ బాడీస్‌) రాధికా గుప్తాతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వే పూర్తయ్యేనాటికి కచ్చితమైన కుటుంబాల సంఖ్య రావాలని ఎంపీడీఓలను కలెక్టర్‌ ఆదేశించారు.

స్వచ్ఛందంగా వివరాల నమోదు..

ఇక్కడే నివాసం ఏర్పరచుకుని ఇతర జిల్లాలలో నివాసం ఉంటున్న వారు స్వచ్ఛందంగా ఎక్కడైన ఒక చోట మాత్రమే వారి వివరాలు నమోదయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అవసరమైన చోట సిబ్బంది..

ఎన్యూమరేటర్లకు అవసరమైనచోట అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని నోడల్‌ అధికారులకు సూచించారు. సర్వే వివరాలను భద్రపరిచేందుకు అవసరమైన ఫైల్‌ ఫోల్డర్లు, బ్యాగులను ఎన్యుమరేటర్లకు అందించాలని సూచించారు.

ఇంటింటికి అతికించిన స్టిక్కర్ల పరిశీలన..

కుటుంబసభ్యులను అడిగే ప్రశ్నలకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌ నేరుగా పర్యవేక్షించారు. సర్వేలో వివరాలను సేకరిస్తున్న ఎన్యుమరేటర్లకు కుటుంబ యజమానులు వారి ఆధార్‌, ఓటర్‌, అవసరమైన కార్డులను చూపించాలని కలెక్టర్‌ కోరారు. పర్యవేక్షణలో భాగంగా యజమానుల నుంచి వివరాలను నేరుగా అడిగి తెలుసుకున్న కలెక్టర్‌ ఆ ఇంటికి స్టిక్కర్‌ కూడా అతికించారు. జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్‌ ఆఫీసర్‌ వినోద్‌కుమార్‌, నోడల్‌ ఆఫీసర్‌ సుకీర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

ఆల్విన్‌కాలనీ: విద్యుత్‌ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే కారణంగా విజయనగర్‌ 11/33 కె.వి. జలకన్య ఫీడర్‌ పరిధిలో గురువారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్‌ నిలిపివేయనున్నట్లు విద్యుత్‌ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. శివనగర్‌, తులసినగర్‌, వాంబే కాలనీలో విద్యుత్‌ నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేవతా పాకశాల ప్రారంభం



దేవతా పాకశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: 4వ ఫేజ్‌లోని సిద్ధి వినాయక భ్రమరాంబ మల్లికార్జున ఆలయంలో అయ్యప్ప సన్నిధానమందు దేవతా పాకశాలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావు, అడుసుమల్లి వెంకటేశ్వరరావు, రాజేష్‌రాయ్‌, సాయిబాబా, భవాని, శేఖర్‌రెడ్డి, రామయ్య, శ్యామ్‌సుందర్‌, అప్పారావు, రమా తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



అంబేడ్కర్‌ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హైకోర్టు లాయర్‌ ఝాన్సీ, అధ్యక్షుడు శాఖయ్య తదితరులు

బాలానగర్‌: బాలానగర్‌ డివిజన్‌లోని నర్సాపూర్‌ చౌరస్తా చిత్తారమ్మ బస్తీ డబుల్‌ బెడ్‌రూమ్స్‌ వద్ద ప్రధాన రహదారి పక్కన అంబేడ్కర్‌ విగ్రహ ఏర్పాటుకు బుధవారం శంకుస్థాపన చేశారు. జాతీయ దళిత స్త్రీ శక్తి కన్వీనర్‌, హైకోర్టు లాయర్‌ గడ్డం ఝాన్సీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ అన్ని కుల, వర్గ, మతాల వారికి భారత రాజ్యాంగంలో సమన్యాయం చేశారని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శాఖయ్య, సామ్యేలు, విజయ భాస్కర్‌, అంజన్న, స్వరూప, లక్ష్మి, అరుణ, సరోజ, రాధ, అనురాధ, రుక్మిణి, జ్యోతి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ భార్య మృతి.. అంత్యక్రియలకు భర్త దూరం!

కారణాలపై పోలీసులు, కుటుంబ సభ్యుల ఆరా



నరసింహారెడ్డి(ఫైల్‌)

సుభాష్‌నగర్‌: వాటర్‌ ట్యాంకర్‌ ఢీకొని మహిళా మృతి చెందిన ఘటనలో భర్త అదృశ్యమయ్యాడు. కనీసం భార్య అంత్యక్రియలకు కూడా భర్త హాజరుకాక పోవడంతో బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వివరాలకు వెళితే.. గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన విష్ణు ప్రియ (33), నరసింహారెడ్డి దంపతులు కొంతకాలంగా సూరారం గ్రామంలో నివాసం ఉంటున్నారు. విష్ణు ప్రియ స్థానికంగా ఓ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. రోజు మాదిరిగానే ఈ నెల 3న భార్యను తన ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకెళ్తుండగా రాత్రి 8 గంటల సమయంలో లక్ష్మీనగర్‌ వద్ద వాటర్‌ ట్యాంకర్‌ ఢీకొట్టింది. ఈ ఘటనలో విష్ణు ప్రియ తీవ్రంగా గాయపడటంతో షాపూర్‌నగర్‌లోని మెడివిజన్‌ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 4వ తేదీన మృతి చెందింది. అప్పటి వరకు ఆసుపత్రి వద్దనే ఉన్న భర్త నరసింహారెడ్డి కనిపించకుండా పోయాడు. భార్య సెల్‌ ఫోన్‌, తన సెల్‌ ఫోన్‌ను స్విచ్‌ ఆఫ్‌ పెట్టాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించక పోవడంతో తమ స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకెళ్లారు. చివరి వరకు అతని రాక కోసం వేచి చూసినా ఫలితం లేకపోవడంతో అంత్యక్రియలు జరిపించారు. ఈ నేపథ్యంలో మంగళవారం బంధువులు సూరారం పోలీసులకు నరసింహారెడ్డి అదృశ్యంపై ఫిర్యాదు చేశారు.

పలు అనుమానాలు...

ట్యాంకర్‌ ఢీకొని మృతి చెందిన ఘటనపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదు. దీంతో సదరు ట్యాంకర్‌ యజమాని స్థానికంగా ఉన్న కొంత మందితో కలిసి కేసును తప్పుదోవ పట్టించడానికి ఇలా చేస్తున్నారని విష్ణు ప్రియ బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నరసింహారెడ్డి భయపడి అదృశ్యమయ్యాడా, లేదా ఇతర ఏదైనా కారణాలు ఉన్నాయా అనేది అతను వస్తే గానీ తెలియదు.

డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించాలి

సనత్‌నగర్‌: విద్యార్థులకు పేపర్‌ వాడకం తగ్గించి డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించాలని ప్రాజెక్ట్‌ ఆఫీసర్‌ నాగేశ్వరరావు సూచించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో బుధవారం సనత్‌నగర్‌ హిందూ మహిళా కళాశాలలో ప్రపంచ పేపర్‌ ఫ్రీ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పేపర్‌ ఉత్పత్తుల కోసం అటవీ సంపద తరిగిపోతుందన్నారు. ప్రపంచ అటవీ నిర్మూలనలో దాదాపు 35 శాతం కాగితం ఉత్పత్తులకే ఉపయోగిస్తుండడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో రికార్డులను డిజిటలైజేషన్‌ చేయడం, ఇ-సంతకాలు, ఎలక్ట్రానిక్‌ కమ్యూనికేషన్‌, లావాదేవీలను ప్రోత్సహించడం, పునర్వినియోగ ఉత్పత్తులను ఉపయోగించడాన్ని విద్యార్థులు ప్రోత్సహించాలన్నారు. అటవీ సంపదను కాపాడుకోవాలంటే పేపర్‌ ఉత్పత్తుల వాడకాన్ని తగ్గించాలని హితవు పలికారు. వరల్డ్‌ పేపర్‌ ఫ్రీ డే సందర్భంగా విద్యార్థినులకు క్విజ్‌ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఓయూలో అమరవీరులకు ఘన నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జంపాల, చంద్రశేఖర్‌, ప్రసాద్‌ అమరవీరుల 49వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్‌ ఆధ్వర్యంలో ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన జే.సీ.ఎస్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజయ్‌ మాట్లాడుతూ జార్జిరెడ్డి అనంతరం జేసీఎస్‌, పీడీఎస్‌యూ బాధ్యతలు భుజస్కంధాలపై వేసుకొని సమసమాజ స్థాపనకు పోరాడినట్లు వివరించారు. వారిపోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థులు విద్యారంగ సమస్యలపై పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర అధ్యక్షులు రియ సిడం బాపూరావు, నగర కన్వీనర్‌ దుర్గం దిలీప్‌, ఓయూ నాయకులు జస్వంత్‌, నవీన్‌, సుధాకర్‌, సంతోష్‌, మనోజ్‌లతో పాటు అరుణోదయ నాయకులు రాకేష్‌, అరుంధతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.